రోడ్డుపైనే మురుగు

- ★ అధ్వానంగా డ్రైనేజీలు
- ★ భరించలేని దుర్గంధం
- ★ రామ్‌నగర్ వాసుల అవస్థలు

వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖ నగరానికి కేంద్ర బిందువు ఆ ప్రాంతం.. పైగా గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయానికి ఆనుకొని ఉంది.. అయితే ఇప్పుడు ఆ ప్రాంతాన్ని మురుగు ముంచెత్తుతోంది. దుర్గంధంతో ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి. 20 ఏళ్ల నాటి డ్రైనేజీ వ్యవస్థ పాడవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. దీంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇదీ నగరం నడిమధ్యలోని రామ్‌నగర్ ప్రాంతం దుస్థితి..



పిఠాపురం కాలనీలోని రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డులోని రాంనగర్ ప్రాంతంలో డ్రైనేజీలు అధ్వానంగా తయారయ్యాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయానికి ఆనుకొని ఉన్నా, ఈ సమస్యను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడంతో మురుగునీరు ప్రవహించకుండా, ఎక్కడికక్కడే నిల్వ ఉండిపోతోంది. దీంతో దుర్గంధం, దోమలతో స్థానికులు తరచూ అనారోగ్యానికి గురవుతున్నారు.

చీఫ్ ఇంజినీర్‌కు వినతి

స్థానిక ప్రజలు డ్రైనేజీ సమస్యతో పడుతున్న ఇబ్బందులపై జీవీఎంసీ చీఫ్ ఇంజినీర్ శివ ప్రసాద్ దృష్టికి వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు తీసుకువెళ్లారు. చాలా ఏళ్ల నాటి డ్రైనేజీ కావడంతో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయనకు వివరించారు. ప్రజలు ఇబ్బంది పడుతున్నందున త్వరగా పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

22వ వార్డులోనూ ఇదే పరిస్థితి..

జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ ప్రాంతంలోనూ ఇదే పరిస్థితి. డ్రైనేజీ సరిగ్గా లేకపోవడంతో మురుగు రోడ్లపైనే ప్రవహిస్తోంది. దీంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రాకపోకలకు అవస్థలు ఎదుర్కొంటున్నారు. జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

పేరుకుపోతున్న చెత్త

20 ఏళ్ల నాటి డ్రైనేజీ వ్యవస్థ కావడంతో ఒకవైపు డ్రైనేజీ శిథిలమవుతుంటే .. మరోవైపు డ్రైనేజీలో చెత్త పెద్ద మొత్తంలో పేరుకు పోతోంది. దీంతో ఎక్కడ మురికి నీరు అక్కడే నిల్వ ఉంటోంది. ప్రతిరోజూ జీవీఎంసీ పారిశుధ్య కార్మికులకు ఫిర్యాదు చేయడం, వారు వచ్చి శుభ్రం చేయటం పరిపాటిగా మారింది. ఇలా రోజూ ఇబ్బంది పడుతున్న ప్రజలు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు

దుర్గంధం భరించలేకపోతున్నాం



డ్రైనేజీలో చెత్త ఎప్పటికప్పుడు పేరుకుపోవడంతో విపరీతమైన దుర్వాసన వస్తోంది. చాలా పాత డ్రైనేజీ కావడంతో పారిశుధ్య కార్మికులు శుభ్రం చేస్తున్నా మరలా చెత్త పేరుకుపోయి, దుర్గంధం వస్తోంది. శాశ్వత పరిష్కారం చూపించాలి.

– ఎస్.నాగవేణి, రామ్‌నగర్



రాంనగర్ ప్రాంతంలో శిథిలమైన డ్రైనేజీ

మరమ్మతులు చేయాలి



ఏళ్ల నాటి డ్రైనేజీ వ్యవస్థ కావటం.. జనాభా సంఖ్య విపరీతంగా పెరగటంతో డ్రైనేజీ ఎప్పటికప్పుడు మురుగునీరుతో పొంగిపోతోంది. దీంతో మేము చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. జీవీఎంసీ ఉన్నతాధికారులు తక్షణమే డ్రైనేజీ మరమ్మతులు చేపట్టి, మాకు ఈ సమస్య నుంచి ఉపశమనం కలిగించాలి.

– ఎం.ఆనంద్ కుమార్, రామ్‌నగర్

ఘనంగా విఘ్నేశ్వరాలయ వార్షిక వేడుకలు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డులోని సింహాద్రిపురం కొండవాలు ప్రాంతంలో వేంచేసి ఉన్న విఘ్నేశ్వరాలయం వార్షిక వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. తెల్లవారు జాము నుంచి స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు జరిపారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు స్వామి వారికి పూజలు చేశారు. అనంతరం భక్తులకు నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొని అన్నవితరణ చేశారు. కార్యక్రమంలో 15వ వార్డు టీడీపీ అధ్యక్షులు బుగత సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్ మళ్ల రవికుమార్, గౌరి, కేబుల్ టీవీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు

వైభవంగా లక్ష తులసీదళార్చన



తులసిమాలల అలంకరణలో వేంకటేశ్వరస్వామి

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీ సెక్టార్–6లోని వేంకటేశ్వరస్వామి, ప్రసన్న ఆంజనేయస్వామి ఆలయంలో 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం కొనసాగాయి. శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన వేడుకల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇందులో భాగంగా స్వామి వారికి చతుస్థానార్చన, నిత్యపూర్ణాహుతి కార్యక్రమా శోభాయమానంగా నిర్వహించారు. భక్తులు, ఆలయ కమిటీ ప్రతినిధులు తులసిదళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. అనంతరం లక్షతులసిదళార్చన నిమిత్తం సమర్పించారు. కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

నవోదయ ప్రవేశ పరీక్షకు 159 మంది హాజరు



తోటగరువు హైస్కూల్ గేటు వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

ఆరిలోవ: జిల్లాలో నవోదయ విద్యాలయలో ప్రవేశం కోసం విద్యాశాఖ అధికారులు శనివారం పలు కేంద్రాలలో పరీక్షలు నిర్వహించారు. తొమ్మిదో తరగతితో పాటు ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ఖాళీ అయిన సీట్ల భర్తీ కోసం ఈ ప్రవేశ పరీక్షలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కేంద్రంలో పరీక్ష రాయడానికి అధికారులు 423 విద్యార్థులకు హాల్ టిక్కెట్లు పంపించారు. వారిలో 159 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తోటగరువు హెచ్ఎం భవాని తెలిపారు. ఉదయం 11 గంటలకు పరీక్ష ప్రారంభం కానుండటంతో గంట ముందుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో హైస్కూల్ వద్ద సందడి నెలకొంది.

రజక సామాజిక భవనం ప్రారంభం



భవనం ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న సురేష్

బీచ్‌రోడ్డు: మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఆర్థిక సహాయంతో జీవీఎంసీ 20వ వార్డులోని చిన్న వాల్తేరులో నిర్మించిన రజక సామాజిక భవనాన్ని శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముువ్వల సురేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఢిల్లీ ఎన్నికల్లో గెలుపుపై బీజేపీ సంబరాలు



పార్టీ కార్యాలయంలో ఎన్నికల ఫలితాలు వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

ఎంవీపీకాలనీ: ఢిల్లీలో బీజేపీ గెలుపొందడం పార్టీకి కొండంత బలాన్ని ఇచ్చిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరుశురామరాజు పేర్కొన్నారు. బీజేపీ విజయం నేపథ్యంలో లాసన్స్ బే కాలనీలోని పార్టీ నగర కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. తొలుత బీజేపీ నాయకులంతా ఎన్నికల ఫలితాలను పార్టీ కార్యాలయంలోని టీవీల్లో తిలకించారు. బీజేపీ విజయం సాధించడంతో స్వీట్లు పంచుకొని సంబరాలు జరుపుకొన్నారు. పరశురామరాజు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీకి లభించిన విజయం ఎంతో ప్రత్యేకమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు అప్పగింత



కుటుంబ సభ్యులకు సిరాజ్‌ని అప్పగిస్తున్న హెచ్‌సీ సత్యనారాయణ, ఏయూటీడీ కార్యదర్శి

సీతమ్మధార : హైదరాబాద్‌కి చెందిన వ్యక్తిని ఎట్టకేలకు కుటుంబ సభ్యులకు అప్పగించారు. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మానసిక ఆరోగ్యం సరిగ్గా లేక హాస్పిటల్‌కి అని చెప్పి విశాఖ వచ్చిన మొహమ్మద్ సిరాజ్ (55)కు ఫోర్త్‌టౌన్ హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ సమాచారంతో ఏయూటీడీ టీఎస్ ఆర్ కాంప్లెక్స్ షెల్టర్‌లో గతంలో ఆశ్రయం కల్పించారు. అనంతరం అతని వద్ద ఉన్న ఫోన్ నంబర్‌తో వారి కుటుంబ సభ్యులకు సమాచారమివ్వడంతో వారు శనివారం ద్వారకానగర్ టీఎస్ఆర్ కాంప్లెక్సులో గల జీవీఎంసీ – ఏయూటీడీ నిరాశ్రయుల వసతి గృహానికి చేరుకున్నారు. ఈ మేరకు వసతిగృహంలో హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ సమక్షంలో సిరాజ్‌ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కార్యక్రమంలో ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, కేర్ టేకర్లు పాల్గొన్నారు.

బాల్య విద్యే భవితకు గట్టి పునాది



స్కూల్ వార్షికోత్సవంలో డీసీపీ లతామాధురి, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం ప్రతినిధి ఫరూఖీ

మద్దిలపాలెం: బాల్య విద్యే భవితకు గట్టి పునాది అని క్రైమ్ బ్రాంచ్ డీసీపీ లతా మాధురి పేర్కొన్నారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే ప్రణాళికబద్ధంగా చదివితే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం జరిగిన గురుస్థానం.. ది ప్లే స్కూల్ ఏడో వార్షిక దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. పిల్లల చదువులో తల్లుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. చదువు పట్ల తల్లిదండ్రులు ఇంటి వద్ద శ్రద్ధ తీసుకుంటే ఉత్తమ విద్యార్థులుగా తయారవుతారన్నారు. పిల్లలకు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. అనంతరం పిల్లలను సరైన మార్గంలో నడిపించడంపై తల్లిదండ్రులతో కొన్ని విలువైన సలహాలను పంచుకున్నారు. వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం ప్రతినిధి ఫరూఖీ మాట్లాడుతూ చిన్నారుల ఉజ్వల భవితకు చదువు, క్రీడలు కూడా ముఖ్యమని పేర్కొన్నారు. చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్కూల్ డైరెక్టర్ ఎస్.ఖాన్, క్రైమ్ ఏసీపీ వెంకటరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిషా.కె, ప్రిన్సిపాల్ గౌసియా బేగం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంపద గణపతి ఆలయం ప్రారంభం



ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న స్థానికులు

బీచ్‌రోడ్డు: రామ్‌నగర్‌లో శ్రీ సంపద గణపతి ఆలయాన్ని వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ పల్లా దుర్గారావు శనివారం ప్రారంభించారు. ఆలయంలో ప్రతిష్ఠించిన గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.కోలాట రాజేశ్వరి, ఆర్.చిన్నారావుల సహకారంతో విగ్రహాన్ని ప్రతిష్ఠించినట్లు నిర్వాహకులు తెలిపారు.

కొత్త ఎన్‌క్లోజర్‌లో 'నీల్‌గై' సందడి





జూలో కొత్తగా మార్చిన ఎన్‌క్లోజర్‌లో మనుబోతులు

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో మనుబోతులు (నీల్‌గై) సందర్శకులను అలరిస్తున్నాయి. ఇంతవరకు మారుమూలలో ఉండే వీటిని అధికారులు రోడ్డు పక్కన ఖాళీగా ఉండే ఎన్‌క్లోజర్లలోకి తరలించారు. విశాలమైన ఈ ఎన్‌క్లోజర్ జూ లోపల రహదారిని ఆనుకుని ఉండటంతో సందర్శకులకు ఇప్పుడు ఇవి స్పష్టంగా కనిపిస్తున్నాయి. అవి వాటి ఎన్‌క్లోజర్‌లో తిరుగుతూ సందడి చేస్తున్నాయి. చూడడానికి గాడిద ఆకారంలో కనిపించే ఈ నీల్‌గై పెద్ద జింక జాతికి చెందినది. వీటిని బూడిద జింక అని పిలుస్తారు. ఇది ఆసియాలోనే అతి పెద్ద జింక జాతి. ఇవి పగటి పూట హుషారుగా సంచరిస్తాయి. వీటి ఆహారం పచ్చి గడ్డి. ఈ నీల్‌గై పొడవైన మెడ, పదునైన పొట్టి కొమ్ములతో ఆకట్టుకుంటుంది. జూలో ప్రస్తుతం 9 మనుబోతులు(నీల్‌గై) ఉన్నాయి. వాటిలో మూడు జతలు పెద్దవి, కాగా మూడు పిల్లలున్నాయి. జూలో వీటి ఎన్‌క్లోజర్ సాంబార్ (కనుజులు) ఎన్‌క్లోజరు ఎదురుగా రోడ్డుకు కొంత దూరంలో కొన్ని సంవత్సరాలుగా ఉంది. ఇవి సందర్శకులకు సరిగ్గా కనిపించడం లేదు. ఇటీవల దాని ఎదురుగా జూ లోపల రహదారి పక్కన ఖాళీగా ఉన్న మరో ఎన్‌క్లోజర్‌లోకి అధికారులు ఒక జత మనుబోతులతో పాటు రెండు పిల్లల్ని తరలించారు. ఆ పిల్లలు తల్లి మనుబోతుతో కలసి ఎన్‌క్లోజర్‌లో హుషారుగా తిరుగుతూ సందర్శకులను అలరిస్తున్నాయి.

బీచ్‌రోడ్డులో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



తనిఖీ చేస్తున్న పోలీసులు

ఏయూక్యాంపస్: సాగర తీరంలో పోలీసులు శనివారం సాయంత్రం తనిఖీలు చేశారు. వాహన చోదకులు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నారా అనేది బ్రీత్ ఎనలైజర్లతో పరీక్షించారు. ఆల్ ఎబిలిటీ పార్క్ ఎదురుగా పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనాలు, కార్లలో ప్రయాణిస్తున్న వారిని ఆపి బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించారు. దీంతో ఆ సమయంలో కాసేపు ట్రాఫిక్‌కు స్వల్ప అంతరాయం కలిగింది.

పుష్పశోభితం

ముడసర్లోవ వెనుక రోడ్ల పక్కన రంగుల పూలు



పుష్పాలు వర్ణశోభితం. విభిన్నమైన రంగులతో కనువిందు చేస్తుంటాయి. మనసుకు ఎంతో ఆహ్లాదాన్ని కలిగిస్తాయి. నగరంలో పలు ప్రాంతాలలో రహదారి పక్కనే విరబూసిన చెట్లు నగరవాసులను అలరిస్తున్నాయి. చినవాల్తేరు నుంచి పార్క్ హోటల్ కూడలికి వెళ్లే మార్గంలో రైల్వే క్వార్టర్స్‌ని ఆనుకుని రోడ్డుపైకి విస్తరించిన బోగన్ విల్లి (కాగితం పువ్వులు) ఎంతో సుందరంగా ఉన్నాయి. పింక్, ఆరెంజ్ రంగుల్లో విరబూసిన ఈ పుష్పాలు ప్రత్యేక ఆకర్షణగా మారాయి. ఇక్కడ నిత్యం పదుల సంఖ్యలో యువత రీల్స్ చేస్తూ, ఫొటోలు తీసుకుంటూ దర్శనమిస్తుంటారు. చినవాల్తేరు నుంచి మానసిక ఆసుపత్రికి వెళ్లే మార్గంలో రోడ్డుపక్కనే నాటిన పలు మొక్కలు పుష్పాలతో అలరిస్తున్నాయి. ముడసర్లోవ రహదారులు కూడా రంగురంగుల పుష్పాలతో కనువిందు చేస్తున్నాయి. చినగదిలి నుంచి ముడసర్లోవ మీదుగా అడవివరం వరకు బీఆర్‌టీఎస్‌లో జీవీఎంసీ నాటించిన పలు రకాల పూల మొక్కలు వాహనచోదకులను ఆకర్షిస్తున్నాయి. ముడసర్లోవ రిజర్వాయరు వెనుక రోడ్డులో మరింత ఆకర్షణీయంగా దర్శనమిస్తున్నాయి. గోల్ఫ్ క్లబ్ వెనుక నాటిన పూల మొక్కలు ఏపుగా పెరిగాయి. డబుల్ రోడ్డు డివైడర్లలో పూలు అందాలతో ఆకర్షిస్తున్నాయి.

– ఏయూక్యాంపస్/ఆరిలోవ



ముడసర్లోవ రోడ్డులో డివైడర్‌పై పూల మొక్కలు



ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖ

మానసిక ఆస్పత్రి మార్గంలో కనువిందు చేస్తున్న పుష్పాలు

ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు స్పందన

బీచ్‌రోడ్డు: ఐడీపీ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో సీబీఎం కాంపౌండ్‌లోని ఐడీపీ కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ విద్యా మేళాకు స్పందన లభించిందని సంస్థ రీజనల్ డైరెక్టర్ కుమార్ తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్య అభ్యసించదలచిన వారికి ఉపయోగకరంగా నిలిచిందన్నారు.

బాలల హక్కుల పరిరక్షణ సామాజిక బాధ్యత



డైరీ ఆవిష్కరిస్తున్న అతిథులు

సీతంపేట : బాలల హక్కుల పరిరక్షణ సామాజిక బాధ్యతని పలువురు వక్తలు పేర్కొన్నారు. చైల్డ్ రైట్స్ అవేర్‌నెస్ ఫోరం రూపొందించిన డైరీ ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఫోరం అధ్యక్షురాలు జి.ధనలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో భారత ప్రభుత్వ ప్రధానమంత్రి బాల పురస్కార అవార్డు గ్రహీత ఆకుల సాయి సంహిత, అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్ క్రీడాకారిణి బొల్లాప్రగడ శ్రీసాహితి, జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ జనరల్ సెక్రటరీ వి.వి.వామనరావు, సౌత్ ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక యూనియన్ డివిజినల్ కో ఆర్డినేటర్ పి.రామమోహన్‌రావు, కేజీహెచ్ ఆర్ఎంవో డాక్టర్ డి.భాస్కరరావు, ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం డైరీని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా వామనరావు మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, ఉల్లంఘనాంశాలపై ఫోరం దృష్టి సారించాలన్నారు. సాయి సంహిత, శ్రీసాహితి మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి తగ్గించేలా ఆటలను ప్రోత్సహించేలా ప్రభుత్వాలు, చైల్డ్ రైట్స్ ఫోరం కృషి చేయాలని సూచించారు. గొండు సీతారాం మాట్లాడుతూ చైల్డ్ రైట్స్ ఫోరం తనదైన శైలిలో వ్యవహరించి రాష్ట్రంలో చక్కని బాలల సంఘంగా పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు కె.ఎల్లయ్య, బి.లవకుశ, ప్రవీణ, బి.సంతోష్, కరుణాకర్, ఎం.హరీష్ కుమార్, బచ్చు లక్ష్మణారెడ్డి పాల్గొన్నారు.

పతకాలు సాధించిన అథ్లెట్స్‌కు అభినందనలు



జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన అథ్లెట్స్

మురళీనగర్ : రాజస్థాన్ రాష్ట్రం అళ్వార్‌లోని రాజ్ రిషీ కాలేజీ మైదానంలో నిర్వహించిన '44వ నేషనల్ మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ – 2025'లో విశాఖ వెటరన్ క్రీడాకారులు సత్తా చాటారు. ఈ క్రీడా పోటీల్లో ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ జనరల్ డాక్టర్ మంగ వరప్రసాద్ నేతృత్వంలో 102 మంది పాల్గొనగా విశాఖపట్నం వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నుంచి 33 మంది పాల్గొన్నారు. పురుషుల విభాగంలో ఎం.రామారావు, వై.గంగాధర్, సీహెచ్.వేణు, కేబీఎం కృష్ణ ప్రసాద్, బి.గణేష్, కె.విశ్వనాథ్, యు.అప్పన్న దొర, మహిళా విభాగంలో జల ఉష, ఏఏవీ రామలక్ష్మి, కె.మత్స్య కొండ, పూర్ణిమ, డి.సరోజ పాల్గొన్నారు. వివిధ విభాగాల క్రీడా పోటీల్లో పాల్గొన్న వీరు 5 స్వర్ణ, 7 రజత, 10 కాంస్య పతకాలు సాధించి విశాఖ కీర్తిని చాటారు. ఈ సందర్భంగా విశాఖపట్నం వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ (వావ్ అసోసియేషన్) న్యూ చీఫ్ పేటర్న్ కమల్ బైద్, న్యూ చీఫ్ అడ్వైజర్ చింతలపాటి సత్యదేవ్, కో – ఆర్డినేటర్ సీహెచ్.శ్రీనివాసరాజు, పీఆర్‌వో వంశీ చింతలపాటి, కార్యదర్శి ఎల్‌వీ సుధాకర్, కోశాధికారి ఎం.రామారావు అభినందనలు తెలిపారు.